గోడకానుకుని వున్న చెట్టెక్కి, గోడమీదకు ప్రాకి, దబ్బున అటుప్రక్కకు దూకి, నిశ్శబ్దంగా ముందుకి నడిచాడు. పైకి చూశాడు. మేడమించి వేస్ట్ వాటర్, కిందకు రావడానికి సిమెంట్ గొట్టం ..... ఆ ప్రక్కన కిటికీలు ..... సిమెంట్ గొట్టాన్ని ఒక చేత్తో, కిటికీ సన్‌షేడ్‌ని ఒక చేత్తో పట్టుకుని పైకెక్కుతున్నాడు. ఆ సమయంలో -- ఏదో వాసనని పసికట్టి కుక్క ఇంటి వెనక్కి కదిలింది. కింద నిలబడిన అంతెత్తు కుక్కని చూసి గతుక్కుమన్నాడు పైనున్న మధుకర్.

* * * *

వంటినిండా సెకండ్ నేచర్ పౌడర్ రాసుకుని, లైట్ ఎల్లో కలర్ ట్రాన్స్‌పరెంట్ నైటీ వేసుకుని, చిందరవందరగా వున్న జుత్తుని బ్రష్ చేసి రూంలోంచి లివింగ్ రూంలోకొచ్చి వీడియో ఆన్ చేసింది.

ఏదో క్రైం సినిమా, తను ఎంతగానో ప్రేమించిన అమ్మాయి తనను ద్వేషించడంతో, ఆ అమ్మాయిని చంపాలని నిర్ణయించుకుని హీరో, ఆ అమ్మాయి వున్న ఎపార్ట్‌మెంట్‌కి వెళ్ళే సీన్. సిమెంట్ గొట్టం పట్టుకుని ప్రాకుతున్నాడు మధుకర్. సీరియస్‌గా చూస్తోంది మహతి.

* * * *_

శ్రీనగర్ కాలనీ మీదుగా వచ్చిన పోలీస్ జీప్, రోడ్ నెం.25 దాటుతుండగా, జీప్‌లోనున్న పోలీస్ ఇన్‌స్పెక్టరు ఆ కాలనీవేపు చూసాడు.

ఒక అరగంట క్రితం తను ఆ రోడ్‌ను క్రాస్ చేసినపుడు వీధిలో లైట్లు వెలుగుతున్నట్టున్నాయి- మరిప్పుడు చీకటిగా వుందే-

పోలీసు మెదడులో అనుమానం చోటుచేసుకుంది. అదే వెనకనున్న కానిస్టేబుల్‌తో అన్నాడు.

"కరెంట్ ఖర్చు తగ్గించడానికి కార్పొరేషన్ వాళ్ళు ఆర్పేస్తుంటారు సార్"

జోకేశాడు కానిస్టేబుల్.

"అంతేనంటావా ..... "

“లేకపోతే ఈ కార్నర్‌కి కేడిగాడెవడొస్తాడండీ” అన్నాడు బీడీ దమ్ము లాగుతూ. జీపు ముందుకు కదిలింది.

*　　　　*　　　　*　　　　*

మధుకర్ వూపిరంతా బిగపట్టి, పైకెక్కి గోడ దూకి సిటౌట్ దగ్గర ఒక్క నిమిషం నిలబడి ముందుకి నడిచాడు.

లాక్ చేసున్న డోర్సుని తెరవడానికి తెచ్చుకున్న కీస్‌ను జేబులోంచి తీసాడు. మహతి బెడ్ రూం లోంచి లైటు కాంతి ..... విండో మిర్రల్లోంచి చూడ్డానికి ప్రయత్నించాడు.

లోన కర్టెన్ వుండడం వల్ల ఏం కన్పించలేదు.

*　　　　*　　　　*　　　　*

గడియారం టంగ్ మని గంటకొట్టింది. బుల్లితెర మీద సినిమా కదులుతోంది. డోరుమీద ఎవరో నాక్ చేసినట్టు వినబడడంతో నిద్రపోతున్న హీరోయిన్‌కి గబుక్కున మెలుకువొచ్చి- హూ ఈజ్ దట్- నెమ్మదిగా అంది.

అట్నించి జవాబు లేదు. మళ్ళీ అడిగింది. జవాబు లేదు- తలుపు చప్పుడు తప్ప- లేచి, లైటువేసి తలుపు దగ్గరకు వెళ్ళింది. హీరోయిన్ లాక్ తీస్తోంది. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ భయంకరంగా వుంది.

అదే సమయంలో ..... తన డోర్‌కి వేసిన ఐరన్ రాడ్‌ని బయటి నుంచి నెమ్మదిగా కోస్తున్న చప్పుడు- ఆమెకి వినిపించడంలేదు.

మహతి బెడ్‌రూం డీలక్స్ సూట్‌లా వుంటుంది. మొదటి గది లివింగ్ రూం, అక్కడ టి. వి, లైబ్రరీ మొత్తం సరంజామా వున్నాయి. ఆ గదిలోంచి లోనకెళ్తే విశాలమైన పర్సనల్ రూం. ఆ రూంలోకి ఎవ్వరికీ ప్రవేశం లేదు.

ఆ రూంలోకి పేరెంట్స్ కూడా రారు. ఆ రూంలో ఏం జరిగినా బయటకు వినబడదు. ఎందుకంటే అది సౌండ్ ప్రూఫ్ కాబట్టి. తలుపు తెరుచుకోగానే కెవ్వున కేకవేసింది హీరోయిన్. ఎదురుగా పెనుద్వేషంతో హీరో.

*　　　　*　　　　*　　　　*

నెమ్మదిగా తలుపు తెరుచుకుంది. సందులోంచి చూశాడు మధుకర్.

మహతి వెనక భాగం కన్పిస్తోంది.

గబుక్కున డోరు తీసి, లోనకడుగు వేసాడు.

ఆ చప్పుడుకి సర్రున తలతిప్పి చూసింది మహతి.

మధుకర్! అతని దగ్గర్నించి వస్తున్న మందు వాసన మహతి ముక్కుపుటాలను తాకింది. లోన ఏమీ ఆచ్ఛాదనలేని మహతి అద్భుత శరీరం వేపు కసిగా చూసాడు మధుకర్.

ట్రాన్స్పరెంట్ గౌనులోంచి కనిపిస్తున్న కరెంట్ ప్రవాహం లాంటి మహతి అందం చూసి పిచ్చెక్కిపోయాడు మధుకర్.

"నేనే. ఎలా వచ్చానని ఆశ్చర్యపోతున్నావా? ఎందుకొచ్చానని కంగారు పడుతున్నావా ..... ? " ముందుకొస్తూ అన్నాడు మధుకర్.

వెనక్కో అడుగు వేసింది మహతి.

"చూడు మహతి ..... పాము పగ పన్నాలుగేళ్ళుంటుందట. నాతో పెట్టుకున్నావ్ - నన్ను ఇన్సల్ట్ చేశావ్. దానికి శాశ్వతమైన శిక్ష వెయ్యడానికి వచ్చాను. ఆ శిక్ష ఏమిటో తెల్సా. ఒక్క నిమిషం టైమ్ ఇస్తున్నాను ..... వూహించుకో" అంటూ జేబులో నుంచి త్రిబుల్ ఫైవ్ సిగరెట్ తీసి, ఖాళీ పాకెట్ను గదిలో ఓ మూలకి విసిరేసి వెలిగించుకున్నాడు.

మూలపడిన సిగరెట్ పాకెట్వేపు చూసింది మహతి.

"నువ్వెటు చూసినా, నా నుంచి తప్పించుకోలేవ్ మహతి" అంటూ ముందు కడుగువేసి అందుకోబోయాడు ఆమెను.

వెనక్కి రెండడుగులు వేసింది మహతి. బెడ్ రూం డోరుని తోసి, లోనికి వెళ్ళబోయిన మహతి భుజమ్మీద మధుకర్ బలమైన చెయ్యిపడింది.

అతని పొడవాటి గోళ్ళ వత్తిడికి నైట్ గౌన్ నుంచి భుజమ్మీద గాట్లు ..... చేత్తో విసిరికొట్టి లోపలకు పారిపోబోయింది- మధుకర్ రెండు చేతుల్తో నడుముని పట్టుకుని, మహతిని తనవేపు తిప్పుకోడానికి ప్రయత్నించాడు.

మహతి ప్రతిఘటిస్తోంది.

అయినా మధుకర్ రాక్షస బలం ముందు, మహతి శక్తి పనిచేయడం లేదు. విసురుగా ఎత్తి, మెత్తని ఫోమ్ బెడ్ మీదకు, బొమ్మలా పడేసి మీద పడ్డాడు మధుకర్.

అదే సమయంలో-

ఆటోమేటిగ్గా డోర్ మృదువుగా, మెత్తగా మూసుకుంది.

ఆమె కంఠం దగ్గర నైట్‌గౌన్‌ని పట్టుకుని చటుక్కున లాగేశాడు.

రెండు ముక్కలుగా నైలాన్ గౌన్ .....

తెల్లటి ట్యూబ్‌లైట్ వెలుగులో పాలరాతి విగ్రహంలాంటి మహతి అందం- నగ్నంగా ..... కసుక్కున పెదిమలమీద, బుగ్గలమీద , గుండెల మీద, భుజాల మీద కసికసిగా ముద్దులు పెడుతున్నాడు మధుకర్.

మహతి ప్రతిఘటిస్తోంది- అరవడానికి ప్రయత్నిస్తోంది- కాని అతని పెదవులమాటున దాగిన ఆమె పెదవులు నిస్సహాయంగా వున్నాయి.

ఆ గది నాలుగు గోడలు అక్కడ జరిగే సంఘటనకు మౌనంగా మిగిలిపోయాయి.

మహతి ప్రతిఘటన ఆశించినంత తీవ్రంగా లేదా అని ఒక్క క్షణం మధుకర్ ఆలోచించాడు.

ఆమె మీద అంతకుముందు వరకూ ఉన్న కసి, కోపం, ఉక్రోషం ఆ క్షణాన కోరికగా రూపాంతరం చెందటంతో -- ఆ విషయానికంత ప్రాముఖ్యత ఇవ్వలేకపోయాడు  మధుకర్.

ఆమె భవిష్యత్ పథకానికి అది వేదికైతే- అతని ఉక్రోషానికది సమయం ..... ? ఒంటరి సమయం. ఆమె మీద అతనికి ప్రేమ ఉంది- ఇష్టం ఉంది- ఆ రెంటినీ పెనవేసుకొనే కోరికా ఉంది.

వాటన్నిటికీ అతీతంగా పంతం, పగ, పట్టుదల, కసి, ఉక్రోషం ఉంది.

అతనా క్షణాన బయోలాజికల్ నీడ్‌ని తీర్చుకోవటంలో దొరికే అనందాన్నే అనుభూతిస్తున్నాడో- ఆమె మీద పగే తీర్చుకొని, తన మేల్ ఇగోని తృప్తిపర్చుకుటున్నాడో తెలీని అలౌకిక స్థితి అతనిది ..... ఆరాటాల పోరాటం ..... నిశ్శబ్ద యుద్ధం కొనసాగుతూనేవుంది.

*  *  *  *

"చప్పుడూ లేదు ..... అరుపులు లేవు ..... ఏవిట్రా" సందేహంగా అన్నాడు దయాళ్.

"రేప్ అయిపోయుంటుందా" విస్కీ బాటిల్లోని డ్రింక్‌ని సిప్‌చేస్తూ అన్నాడు సురేష్.

*  *  *  *

ఎ.సి. చల్లనిగాలి, ఆ ఇద్దరి వంటిమీదున్న చెమట బిందువుల్ని చల్లబరుస్తోంది.

విజయగర్వంతో ఆమె వంటిమీంచి లేచాడు మధుకర్. అది నిజముగా విజయమేనా?! మగత తీరిన కళ్ళతో, పక్కకు తిరిగి పడుకుంది మహతి- ఎంతో సంతృప్తిగా కూడా! ఫాంటూ, షర్టూ వేసుకుని, డ్రెస్సింగ్ టేబుల్ మిర్రర్లో తననొకసారి చూసుకుని, జుత్తు సవరించుకుని, ఆ గది నాలుగువేపులా ఒకసారి చూసి, అక్కడనుంచి కదలబోతున్న సమయంలో--

మహతి కుడిచెయ్యి అతని చేతిని పట్టుకోవడంతో, తల తిప్పాడు మధుకర్ బెడ్‌షీటు వంటిచుట్టు కప్పుకుని లేచి కూర్చుంది మహతి.

"ఇదేనా ..... నీ కక్ష?- పూర్తిగా చల్లారిపోయిందా" చాలా ప్రశాంతంగా అడుగుతున్న ఆ మాటకు జవాబు చెప్పలేకపోయాడు మధుకర్.

మధుకర్‌కు చాలా ఆశ్చర్యంగా వుంది

తను మహతిని దారుణంగా రేప్ చేయాలని వచ్చాడు- కానీ అందుకు విరుద్ధంగా అంతా జరిగినట్టుంది.

మహతి ప్రతిఘటించిందా? లేదా? పూర్తిగా ప్రతిఘటించలేదు ..... అలాగని పూర్తిగా సహకరించలేదు.

ఇంతవరకూ చాలామంది స్త్రీలతో అనుభవం వుంది కానీ మహతిలో ఈ అనుభవం చాలా ప్రత్యేకంగా , చాలా అద్భుతంగా వుంది ..... దానిక్కారణం ఏమిటో అర్థంకావడం లేదు.

"మరి నాకు కంపెన్సేషన్ ఏమిస్తావ్ ..... నీకలవాటే కదా ..... టెన్ లాక్స్ ఇస్తావా?" ట్వంటీఫైవ్ లాక్స్ ఇస్తావా ..... ? ఇంతకీ నా రేటెంత నిర్ణయించావ్-" సూటిగా అడుగుతున్న మహతి వేపు అర్థం కానట్లుగా చూసాడు మధుకర్.

"నీ రేటెంతో చెప్పు. ఇప్పుడే చెక్కిస్తాను-" సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు మధుకర్.

"మళ్ళీ పాత ప్రశ్నే అడుగుతున్నాను నీ డబ్బే ఇస్తావా, మీ డాడీ సంపాదించిందే ఇస్తావా?"

జరగరాంది జరిగినా- ఆ ఆనవాళ్ళేమీ ఆమె మోములో కనిపించక పోగా, తాపీగా తనని ఆపి ప్రశ్నించడం చూసి మధుకర్ దిమ్మెర పోయాడు.

"నీ క్కావలసింది డబ్బు- అంతే గదా? అదెవరిదైతే నీకెందుకు?" పొగరుగా అన్నాడు మధుకర్ -ఆమె ప్రవర్తనకు ఎలా రియాక్ట్ అవ్వాలో తెలీక.

"నాకు కావలసింది డబ్బే అయితే ..... నువ్వు అనుభవించిన అమ్మాయికి, మీ డాడీ డబ్బు ఇస్తాననడం. ఆర్యూ ఎషేమ్డ్ ఆఫ్ ఇట్. సిగ్గెయ్యదా నీకు?"

జవాబు లేదు మధుకర్ దగ్గర - పిచ్చెత్తిపోయి చూసాడు.

"కానీ నువ్వు కాంపెన్సేషన్ ఇచ్చేముందు ఒక విషయం గుర్తుంచుకో, రేప్ చేసిన నీ రాక్షసత్వానికి వెలకట్టుకుంటావో, ఆ రాక్షసత్వాన్ని మౌనంగా భరించిన నా ప్రేమకు వెల కడతావో నిర్ణయించుకో"

రాక్షసత్వాన్ని మౌనంగా భరించిన ప్రేమ!

మధుకర్ మెదడులో ఎన్నో లక్షల ప్రశ్నలు. అతన్లో, ఏదో భావంలేని సంచలనం. ఏ ఆడదీ తననలా ప్రశ్నించలేదు. ఏ ఆడదీ తనని అలా రెట్టించలేదు. అతని పురుషత్వాన్ని మొట్టమొదట సవాల్ చేసిన ఆడది మహతి.

"నిన్ను నాశనం చేసినా నీకు బుద్ధి రాలేదు. యూ డర్టీ ..... " అసహనంగా ఏదో తిట్టబోయాడు మధుకర్.

ఆ సమయంలో బెడ్‌మీంచి స్ప్రింగ్‌లా లేచి ఒక్క అంగలో అతని ఎదుటకు వచ్చి, ఫడేల్మని చాచి దవడ వాచిపోయేలా కొట్టింది మహతి.

అ సంఘటనను వూహించలేదు మధుకర్.

"వూ ..... తిట్టు ..... ఏమిటని తిడుతున్నావ్? యూ డర్టీ ..... బిచ్ ననబోయావ్. అవునా? నేను బిచ్‌నైతే, నువ్వేమౌతావ్, తెల్సా? బాస్టర్డ్‌వి అవుతావు. నువ్వు రేప్ చెయ్యగానే, నేను గిలగిలా కొట్టుకుని ఏడ్చి, నీ కాళ్ళు పట్టుకుంటాననుకున్నావ్. అవునా? నేనలా ప్రవర్తించినందుకు నీలో మగతనం దెబ్బతింది. అవునా?

గదిలో 'రేప్' చేయడం మగతనమనుకుంటున్నావా? ఇదే మగతనం అనుకుంటే, వీధిలో వెళ్ళే కుక్క, నీలాంటి మగవాడూ ఒకటే అవుతాడు. గుర్తుంచుకో."

సడన్‌గా ఉద్రేకాన్ని అదుపులోకి తెచ్చుకుంది మహతి.

“ఊహూ. మగతనం గురించి నువ్వు మాట్లాడ్డం బాగానే వుంది. మగతనం గురించి ‘డెఫినిషన్’ ఇచ్చేటంత అనుభవం వచ్చిందన్నమాట. అదీ ఒక్కసారికే?”

“భేష్” వ్యంగంగా నవ్వుతూ అన్నాడు మధుకర్.

“వాట్ డూ యూ మీన్ మిస్టర్ మధుకర్? మగతనమంటే సెక్స్‌లో నీ బలం ప్రదర్శన అనుకున్నావా? పిచ్చోడా ..... MAN POWER అంటె[ WILL POWER . MAN POWER అంటే INTELLIGENT EFFORT, తండ్రి సంపాదించిన ఆస్తితో , తైతక్కలాడడం, తండ్రి సంపాదించిన కార్లలో తిరగడం, బార్లలో తాగడం, అమ్మాయిల్తో పోవడమే లక్ష్యమ్నుకుంటే- నీలాంటి వాళ్ళకి చరిత్ర చూపించే దారేమిటో తెల్సా? గోదారి. మగతనమనేది నీకుంటే నాతో సిన్సియర్‌గా చాలెంజ్ చెయ్- కమాన్ - ఐ విల్ షో యూ ది వే ఆఫ్ చాలెంజ్ -- చెయ్యగలవా? నీకా దమ్ముందా? నీదైన దారిలో నువ్వు బతకాలంటే కమాన్.”

మధుకర్ అతిశయమ్మీద, అహంకారమ్మీద, అహంభావమ్మీద దెబ్బ తీస్తున్న ఆడది మహతి.

“నేనెలా బతకాలో నువ్వు నాకు చెప్తావా? చెప్పు” బెడ్‌షీట్‌ను వంటినిండా కప్పుకుంటున్న మహతివేపు సూటిగా చూస్తూ అన్నాడు.

“చెప్పు అని నంగిగా అడగడం కాదు. ఇది బిలియన్ డాలర్స్ చాలెంజ్. నీ సుఖాలన్నీ వదిలేసుకుని, నువ్వు రోడ్డుమీదకు రావాలి. రాగలవా? నీకున్న కోట్ల ఆస్తిని వదిలిపెట్టి , నీ కాళ్ళమీద నిలబడాలి. నిలబడగలవా? వితవుట్ సింగిల్ పైసా, ఒక్క పైసా జేబులో లేకుండా రా. ఒక్క ఆర్నెల్లు ఏ ఒక్కడి సహాయం లేకుండా నీ ఆత్మ విశ్వాసంతో, నీ ఆత్మశక్తితో, నీ వ్యక్తిత్వంతో, నీ మగతనంతో, నీ తెలివి తేటలతో, నువ్వు బతికి చూపించు. మగవాడంటే అలా బతకాలని, అలా నిలదొక్కుకోవాలని చూపించు. అదీ మగతనమంటే. ఏం ఆశ్చర్యంగా చూస్తున్నావ్? నీకు చేతకాదు కదూ?” రోషంతో కవ్విస్తూ అంది మహతి.

మధుకర్‌కి ఒక్కసారి మెదడంతా మొద్దుబారినట్టయి పోయింది. 'నీకు చేతకాదు. కదూ ..... నీకు చేతకాదు కదూ ..... నీకు చేతకాదు కదూ' తన మగతనాన్ని వెక్కిరిస్తున్న ఆడది.

"నన్ను రోడ్డుమీదకు రమ్మంటావ్ అంతేనా? ఒక్క పైసా లేకుండా రావాలి. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలి. అంతేనా? ఎంత సంపాదించమంటావ్?" తనలో రేగుతున్న కసి, కోపాన్ని, ఉక్రోషాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"ఎంతయినా సంపాదించు కానీ అది నిజాయితీగా సంపాదించాలి. ఆ డబ్బుగానీ, ఆ ఆస్తిగానీ నీదై వుండాలి."

"ఓ. కే. ఇది చాలెంజ్ అయితే, నీతోనే నా చాలెంజ్. ఇది గేమ్ అయితే, నీతోనే నా గేమ్. నీకూ నాకూ మధ్య పోటీ, కమాన్" ఇప్పుడు రెట్టించడం మధుకర్ వంతయింది. అతన్లో ఏదో తెలీని ఆవేశం ప్రవేశించింది.

తను ఎటు వెళుతున్నాడో ..... ఏ వేపుకి లాగబడుతున్నాడో ..... తనకే తెలీని స్థితి-- తను మగవాడు. మహతి ఆడది. బలత్కారం చేయగల శారీరక శక్తి, ఆపైన అది కేసు కాకుండా చేసుకోగల డబ్బుందని, తనకు జరిగిన అవమానానికి ఆమె శీలాన్ని స్టేక్ చేయాలని వచ్చి సక్సెస్ అయ్యాడు.